

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

## – విజయరాణి కోడూరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

(గత సంచిక తరువాయి)

**ఒకసారి పారిపోయింది లతమ్మ**. బస్సులన్నీ నిలిపించేసి, పట్టికొట్టాడు, కాల్చి వాతలు పెట్టాడు. ఆ బిడ్డను చూస్తుంటే నా గుండె అవిసిపోతందయ్యా. మనుషులమేమీ చెయ్యలేం ఆడిని. లతమ్మను దేవుడే రక్షించాలి ఇక. ఫో అయ్యా పో. ఆ బిడ్డకు కూడా చెప్పు ఇటు రావద్దని." అంటూ ఆమె వేగంగా వెళ్ళిపోయింది.

ఇదీ జరిగింది. "అప్పుడు నన్నేం చేయమంటావో చెప్పరా?" రోషంగా అరిచాడు అరుణ్.

హేమంత్ మాట్లాడలేదు. అతడు కూర్చున్న భంగిమలో మార్పు లేదు.

తిరిగి అరుణే అన్నాడు "నాకు మళ్ళీ ప్రయత్నించటానికి అవకాశమే లేదు. వాళ్ళ చేతుల్లో నేను ఛస్తే, ఇన్ఫర్మేషన్ కూడా ఇవ్వలేను కదా.

"నాకు నువ్విచ్చింది రాంగ్ ఇన్ఫర్మేషన్ కదా. ఎంత బాగా నటించావురా!"

"ఏం చెప్పమంటావురా? నిన్ను చంపటానికి వెతుకుతున్నారు. నిజం చెపితే, చావు నోట్లోకి వెళ్ళి చస్తావా?" అరుణ్ స్వరం తీవ్రంగా మారింది.

"నీ దృష్టిలో నేను బ్రతికున్నట్టా? చస్తే ఛస్తాను. నిన్ను పంపించటమే నేను చేసిన పెద్ద తప్పు. రెండు సంవత్సరాలలో నా ప్రాణం పోయినా సరే వెళ్ళి లతను ఆ నరకం నుంచి కాపాడుకునేవాడిని. నేను బయల్దేరేముందు, రోజూ అంటూనే వుంది లత పాపం, 'ఎపుడొస్తావ్? నాకెందుకో భయంగా ఉంది అని. ఎన్ని బాధలు పడిందో? పెళ్ళైపోయింది, వెళిపోయింది అన్నావు. అది విన్న తర్వాత కూడా బ్రతికే ఉన్నాను.. పోనీలే ఎక్కడున్నా తను సుఖంగా ఉండాలని కోరుకుంటూ ఇన్నేళ్ళూ ఏడుస్తూ బ్రతికానురా. నువ్వు నాకు ద్రోహం చేశావ్. ఎందర్నో ఆదుకుంటున్నాను, నా లతను ఆ నరకంలో వదిలేసి. నీ వల్లేరా రెండవసారి చచ్చిపోయాను.."

"నేను ద్రోహం చెయ్యలేదురా హేమంత్. చిన్న అబద్ధం చెప్పి నిన్ను కాపాడుకున్నాను.

"హ! నన్ను కాపాడుకున్నావ్ రా ఫూల్! పాపం ఆడపిల్ల, లత ఎన్ని బాధలు పడుతుందోనని ఒకసారైనా ఆలోచించేవా? తనకు పెళ్ళైందో లేదో కూడా తెలియదు. ఇలా పేషెంట్‌లా ఎందుకైపోయిందో పాపం" కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు హేమంత్.

"లత మనతోనే ఉండగా ఎందుకురా ఈ బాధ? తెలుస్తుందిగా."

"మనతోనే ఉందా? అంటే మనదేనా?" తను ఎవరి సొత్తో తెలియదుగా?" తీవ్రంగా మారింది హేమత్ స్వరం.

"హేమంత్, లతను కొంచెం కోలుకోనియ్యి. నీ ప్రశ్నలన్నింటికీ తనే చెప్తుంది జవాబు. దయచేసి అంతవరకు నువ్వు బతుకు, నన్ను బతకనియ్యి ప్లీజ్..." అంటూ రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టి కళ్ళనీళ్ళు పెట్టుకున్న అరుణ్ వైపు విస్మయంగా చూశాడు హేమంత్.

మౌనంగా ఉండిపోయాడు అతడు.

నెమ్మదిగా డోర్ తెరచి బయటకు వెళ్ళిపోయాడు అరుణ్.

ఉదయం తొందరగా లేచి తయారైపోయి బ్రీఫ్ కేస్ సర్దుకుంటున్న హేమంత్, ఏదో గుర్తువచ్చినట్టు అల్మారా దగ్గరకు వెళ్ళి లత డైరీ తెచ్చి బ్రీఫ్‌ను మళ్ళీ తెరిచి అందులో పెట్టాడు. బ్రీఫ్ చేత్తో పట్టుకునేసరికి తలుపు తట్టిన శబ్దం అయింది.

"కమిన్" అన్నాడు.

అరుణ్ వచ్చాడు.

"ఆగ్రాకు వెళ్తున్నావా?" అడిగాడు.

"అవును. వెళ్తున్నాను" అన్నాడు.

"ఫ్లైట్ టికెట్ రిజర్వ్ చేశావటగా, ఇదిగో పంపించారు." అంటూ ఇచ్చాడు హేమంత్‌కు. అందుకుని పాకెట్‌లో పెట్టుకున్నాడు మౌనంగా.

"ఇపుడు ఎందుకురా ఈ ప్రయాణం?"

"పనులున్నాయి. వెళ్ళాలి ఒకసారి."

"లత కాన్షస్‌లోకి రాలేదు కదరా. నువ్వు వెళ్తే ఎలా?"

అరుణ్ అతడికి అడ్డంగా నిలబడుతూ అడిగాడు.

"విన్సెంట్ సర్, నువ్వూ ఉన్నారుగా చూసుకోవటానికి."

"లత బ్రతికింది నా కోసమేరా. లేస్తూనే నిన్నే అడుగుతుందిరా."

"నువ్వు ఏదో ఒకటి చెప్పి నమ్మించగలవుగా" చురుక్కుమంది అరుణ్‌కు.

"మంచి జరగటం కోసం చేసేది ద్రోహం, మోసం కాదురా హేమంత్" బాధగా అన్నాడు అరుణ్.

"మంచి జరిగింది కదరా. అదిగో జీవచ్ఛవంలా పడి ఉంది ఐసియులో. అదేగా మనం చేసిన మేలు తనకు. తను స్పృహలోకి వస్తే నా ముఖం ఎలా చూపను తనకు? నీ పాట్లు నువ్వు పడు అని వదిలేసిన దుర్మార్గుడిని. వాళ్ళ ఫాదర్ పోయినపుడు, లతను తీసుకెళ్ళినపుడు, 'భయపడకు లతా, నీకు నేనున్నాను" అని ధైర్యం చెప్పి వదిలి వెళ్ళాను. లీవ్ ఇట్ అరుణ్" అంటూ ముందుకు వెళ్ళినవాడు మళ్ళీ వెనక్కి వచ్చాడు హేమంత్.

"అల్మారాలో లతది చాలా జ్యుయెలరీ, ఎమౌంట్ కూడా ఉన్నాయి. జాగ్రత్త, అవి మళ్ళీ లతకు అప్పగించాలి."

"నాకిలాంటి బాధ్యతలు ఎందుకు అప్పగిస్తున్నావ్‌రా? నిజం చెప్పు నువ్వు ఎప్పుడొస్తావ్, నేనేమైనా తప్పుగా మాట్లాడినా, తప్పుగా చేసి వున్నా నన్ను క్షమించరా హేమంత్. నన్ను మరొకలా శిక్షించకు. నేను తట్టుకోలేను. నీమీద ప్రేమతో నీ గురించే ఆలోచించాను. కాని లత గురించి పట్టించుకోలేదు. అదినా తప్పు కావచ్చు, ఏమీ చెయ్యలేని అసమర్ధతా కావచ్చు."

ఒక్కసారిగా హేమంత్‌ను చుట్టేసాడు అరుణ్.

బ్రీఫ్‌కేస్ చేతిలోంచి వదిలేశాడు హేమంత్. అది కిందపడింది. అరుణ్ చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకున్నాడు.

"ఊరుకోరా అరుణ్. సారీ, నా మనసు బాగోక ఏదో మాట్లాడేశాను. పనులు కూడా ఉన్నాయి అక్కడ, కాని, ఒకసారి అలా తిరిగి వస్తే నా మనసుకు స్థిమితం దొరకొచ్చు అని వెళ్తున్నాను" అన్నాడు హేమంత్.

లిఫ్ట్‌లో క్రిందకు దిగారు ఇద్దరూ.

హేమంత్ లత బెడ్ దగ్గరకు వెళ్ళాడు. ఆమె తలపై చెయ్యివేసి నిమిరాడు. అతడి కళ్ళు నిండాయి.

"ఎన్ని కలలు, కబుర్లు పంచుకున్నావో నాతో" అతడి గుండె స్పందన పెరిగింది.

"నన్ను క్షమించు. అంటూ వేగంగా బయటకు వచ్చేశాడతడు.

నెమ్మదిగా, డాక్టర్ విన్సెంట్ రూములోకి వెళ్ళాడు హేమంత్.

"రా హేమంత్ కూర్చో ఒక్క క్షణం" అన్నాడతడు కుర్చీ చూపుతూ.

కూర్చున్నాడు హేమంత్.

"అలా డల్‌గా ఉన్నావేంటి హేమంత్? లతకు మెలుకువ వస్తుంది కొద్ది గంటలలో."

"థాంక్యూ సర్" అన్నాడు.

"మరి సరిగ్గా ఇప్పుడు ప్రయాణం పెట్టుకున్నావేంటి? అమ్మాయికి కనిపించాక వెళ్ళొచ్చుకదా" అన్నాడు అతడు.

"అక్కడ కొంచెం నేను స్వయంగా వెంటనే చూసుకోవలసిన పనులున్నాయి కొన్ని. త్వరగానే వచ్చేస్తాను సర్" అన్నాడు.

"నువ్వు ఉంటే మంచిది హేమంత్. డోంట్ బి హేప్టీ" అన్నాడు డాక్టర్ విన్సెంట్.

"లతను జాగ్రత్తగా చూసుకోవటానికి మీరూ, అరుణ్ ఉన్నారుగా. అయినా నన్ను లత వెంటనే చూడటం మంచిది కాదని కూడా అన్నారు కదా."

"ఆ మాట అన్నది నేనే హేమంత్. అది ఒన్ సైడ్ మాత్రమే. దానికి అదర్‌సైడ్ కూడా ఉండవచ్చు. లత నిన్ను వెంటనే చూస్తానంటే నువ్వు అందుబాటుగా  లేకుంటే కూడా ప్రాబ్లమే కావొచ్చు. దేవుడి దయవల్ల లత మనకు దక్కింది. హ్యాపీగా సెలబ్రేట్ చేసుకోవాలిగా అది మనం. టేక్ కేర్ హేమంత్" అన్నాడతడు.

"థాంక్యూ సర్" అంటూ వెళ్తున్న హేమంత్‌ను చూస్తూ ఉండిపోయాడు అతడు.

"గాడ్‌బ్లెస్ యు మై ఛైల్డ్" అన్నాడతడు.

హేమంత్ వెళ్ళాలన్న నిర్ణయం మారలేదు.

హేమంత్‌తో ఎయిర్ పోర్ట్‌కు వెళ్ళాడు అరుణ్.

టేక్ ఆఫ్‌కు ఇంకా సమయం ఉంది.

"లత జాగ్రత్తరా అరుణ్" అన్నాడు హేమంత్.

"నన్ను క్షమించరా హేమంత్, నామీద కోపంతో వెళ్తున్నావు" బాధగా అంటూ అతడి గుండెలో ఒదిగిపోయాడు అరుణ్.

"నాకు నీమీద కోపం ఏంటిరా? నామీద నాకే కోపం. పాపం, నన్నే నమ్ముకుందిరా లత. వాళ్ళ ఫాదర్ లేకున్నా భయపడకు నీకు నేను ఉన్నానని భరోసా ఇచ్చి వెళ్ళాను ఆగ్రాకు. అంతకు నాలుగురోజుల ముందు నుంచీ అంటూనే ఉంది, తన మనసులో ఎందుకో అలజడిగా ఉందని. ఏదో సిక్త్‌సెన్స్ తనకు. తనకు న్యాయం చెయ్యలేకపోయిన నా అసమర్ధతపై కోపం. అందుకు కారణాలు ఏవైనా కావచ్చు..."

ఫ్లైట్ గురించి ఎనౌన్స్‌మెంట్ రావటంతో "టేక్ కేర్‌రా" అంటూ వెళ్ళిపోయాడు హేమంత్.

అతడి విమానం టేక్ ఆఫ్ అయ్యాక వెను తిరిగాడు అరుణ్.

అరుణ్ మనసులో సంఘర్షణ మొదలైంది.

'తను చేసింది తప్పే. హేమంత్‌ను కాపాడుకోవాలనే ఆలోచించాడతను. లతవైపు నుంచి కొంచెం కూడా ఆలోచించనేలేదు. తను చేసింది తప్పేకదా! హేమంత్‌కు నిజం చెప్పకుండా సరిదిద్దుకోలేని తప్పు చేశాడు తను' అతడి మనసులో పదే పదే అదే ఆలోచన తలెత్తటంతో అశాంతిగా ఉంది అతడికి.

ఫ్లైట్ దిగి  కారెక్కిన హేమంత్‌కు, అల్లకల్లోలంగా తయారైంది మనసు. తను ఇలా రావటం కరెక్ట్ కాదేమోనన్న బాధ బయలుదేరింది.

ఒక పేషెంట్‌ను బ్రతికించటం అన్నది ఒక డాక్టర్ కర్తవ్యం. తను, లత తన స్వంతం కాదు అన్న ఆలోచనతో వచ్చేశాడా వదిలేసి? 'నో' అరిచింది అతడి మనసు. తనది అటువంటి సంకుచిత స్వభావం కానేకాదు. మరి ఎందుకు స్పృహలో లేని లతను వదిలి వచ్చాడు ఇంత దూరం?

ఆ ప్రశ్నకు సమాధానం రాలేదు మనసునుండి. ఇన్నేళ్ళూ లత కోసం పరితపించిన తను ఆమె తనను చేరుకున్న తరుణంలో ఆమెనుండి దూరం కోరుకుంటున్నాడు ఎందుకు? లత తనను వెతుక్కుంటూ వచ్చింది. వచ్చేముందు డాక్టర్ విన్సెంట్ అన్న మాటలు కూడా గుర్తుకు వస్తున్నాయి పదే పదే.

"కాన్షస్‌లోకి రాగానే నువ్వు కనిపిస్తే ఎమోషన్ కావచ్చు అన్న ఆలోచన ఒక సైడ్ అనుకో. కాని అదర్ సైడ్ కూడా ఉండవచ్చు."

"లత బ్రతికున్నది మాత్రం నీకోసమేరా" అరుణ్ మాటలు కూడా గుర్తుకు వచ్చాయి.

పేషెంట్లు, తమ ఆప్తులకోసం అడగటం అన్నది సహజమే. ఏదో తెలియని అలజడి మొదలైంది హేమంత్ మనసులో.

కారు దిగగానే లక్ష్మణ్ పరుగున వచ్చాడు. చేతిలో బ్రీఫ్ అందుకున్నాడు. వెనకే తనూ పైకి వెళ్ళాడు అతడు.

"సర్. బ్రేక్ ఫాస్ట్ చేసారా? చేస్తారా?

"ఊ" అన్నాడు.

"సర్. లంచ్ తయారు చెయ్యమంటారా?"

"వద్దు. ఫ్రిజ్‌లో పళ్ళు ఉంటే చూడు. ఒక కప్ కర్డ్ కూడా" చెప్పాడు హేమంత్.

"లక్ష్మణ్" పిలిచాడతడు.

"సర్" పరుగున వచ్చాడు.

"ఆ రూమ్ కీస్ ఎక్కడున్నాయి?"

"మీరు చెప్పినట్లే మేడమ్ సార్‌ల ఫోటోలు హాలులోనుంచి ఆ గదిలోకి మార్చాను సర్. తాళం వేసి తాళాను నాదగ్గరే ఉంచుకున్నాను. మీకు ఇమ్మంటారా?"

"వద్దు. నీ దగ్గరే ఉంచు. ఇపుడు ఒకసారి ఓపెన్ చెయ్యి. ఇంకెవరికీ ఓపెన్ చెయ్యకు" చెప్పాడు.

"అలాగే సర్" అంటూ రూం ఓపెన్ చేశాడు అతడు.

రిఫ్రెష్ అయి వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

లక్ష్మణ్ తాజా పూలు తెచ్చి ఫోటోల దగ్గర పెట్టాడు. నెమ్మదిగా లేచి లోపలకు వెళ్ళాడు హేమంత్.

అతడికి తల్లి తండ్రుల ఫోటోల వైపు చూడలంటే చాలా అనీజీగా అనిపిస్తుంది.

'వాళ్ళు తననేదో ప్రశ్నిస్తున్నట్లుగా ఉంటాయి ఆ కళ్ళు ' ఫోటోల ముందు లైటు వెలుగుతుంది.

బాధగా తలెత్తి చూశాడతడు.

"మీకు విశ్రాంతి కావాలి అనేవాడిని. నా కోరికను ఈ విధంగా తీర్చి విశ్రాంతి తీసుకుంటున్నారా?" అతడి కళ్ళు చెమ్మగిల్లాయి.

చేత్తో వారి ముఖాలను తాకి పెదవులతో ఆ చేతిని స్పృశించాడు.

"లత బ్రతికిందమ్మా! మీరే నిర్దయగా నన్ను వదిలేసి వెళ్ళిపోయారు" నెమ్మదిగా హాలులోకి వచ్చాడు.

"లాక్ చెయ్యమంటారా సార్?" అడిగాడు లక్ష్మణ్.

"ఊ" అన్నాడు పరధ్యానంగా. లాక్ చేసి వెళ్ళిపోయాడతడు.

లక్ష్మణ్, ప్లేట్లో పళ్ళ ముక్కలు, కప్పులో పెరుగు తెచ్చి టేబుల్‌పై పెట్టి "తినండి సార్" అన్నాడు. జగ్‌లోంచి వాటర్ గ్లాస్‌లో పోసాడు.

"లక్ష్మణ్, మీరంతా తిన్నారా?" అడిగాడు హేమంత్.

"కరుణ బెహన్ తయారు చేస్తుంది సార్. తింటాం" చెప్పాడు లక్ష్మణ్.

"లక్ష్మణ్, ఫ్రిజ్ అంతా ఖాళీచేసేసి క్లీన్ చేసేయ్."

నెమ్మదిగా సోఫాలో వెనక్కు వాలిన హేమంత్‌కు కళ్ళు మూతలు పడుతున్నాయి. నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు.

సెల్‌రింగ్ అవ్వటంతో మెలుకువ వచ్చింది అతడికి. చూసాడు 'అరుణ్ '

"హలో అరుణ్, లతకి ఎలా వుందిరా? ఎవ్విరి థింగ్ ఓకెనా?"

"ఆ బాగానే వుందిరా. నువ్వెళ్ళిపోయావు. లత మెలుకువలోకి వస్తుందేమోనన్న టెన్షన్‌తో ఉన్నానురా."

మౌనంగా ఉండిపోయాడు హేమంత్.

"సరే, ఏం చేస్తున్నావో పలకరిద్దాం అని చేసాను అంతే. భోజనం చేసావా?" అడిగాడు అరుణ్.

"చేసానురా" అన్నాడు.

"సరే, రెస్ట్ తీసుకో" అంటూ కట్ చేసాడు అరుణ్.

హేమంత్‌కు ఏమీ తోచనట్టు మనసంతా శూన్యంగా అనిపిస్తుంది. కాసేపు పేపర్ చూసాడు.

అది పక్కన పడేసి, టివి ఆన్ చేసాడు.

ఛానల్స్ మార్చుతుంటే, ఒక ఛానల్‌లో పాట వస్తుంది.

"మనసు గతి ఇంతే.. మనిషి బ్రతుకు ఇంతే..

అంతా మట్టేనని తెలుసు.... అదీ ఒక మాయేనని తెలుసు..

తెలిసి వలచీ విలపించుటలో తీయదనం ఎవరికి తెలుసూ...'

"హు. తీయదనం" అంటూ టివి ఆఫ్ చేసేసాడు.

అతడికి లత మాటలు గుర్తొచ్చాయి.

"ప్రేమ కూడా పచ్చబొట్టులాంటిదే హేమ్!

బాధ కలుగుతుంది అని తెలిసి, మురిపెంగా వేసుకుంటాం!

ప్రేమా అంతే, ఎన్నో అవరోధాలు, మరెన్నో అడ్డంకులు

అన్నీ దాటుకుని గెలుచుకోవాలి అని తెలిసి కూడా

ప్రేమ వెనుక పరుగు తీయటం మానం!"

లత అన్న మాటలను ఒక పేపర్ మీద భద్రపరిచాడు తను. అది బ్రీఫ్ కేస్ లోపల పాకెట్‌లో పెట్టాడు. అతడు వెంటనే బ్రీఫ్‌ను టీపాయ్ మీదనుంచి ఎత్తాడు ఓపెన్ చేద్దాం అని. అందులో ఉన్నవన్నీ మూత తెరుచుకుపోయి క్రిందపడిపోయాయి.

"లక్ష్మణ్" అని పిలిచాడు.

క్రింద పడిపోయిన లత డైరీ ఓపెన్ అయిపోయి ఒక పేజ్ కనిపిస్తుంది. ఆ పేజ్ కార్నర్‌లో ఏదో రాసి వుంది. తీసి చూశాడు పైకి.

పేజ్‌కి కుడివైపు మూలన తెలుగులో 'రాజేశ్వరి' అని రాసి ఉంది. క్రింద ఒక సెల్ నంబర్ కూడా వుంది. లక్ష్మణ్ వచ్చి, క్రింద పడిపోయినవన్నీ తిరిగి బ్రీఫ్‌లో సర్ది పెట్టి వెళ్ళిపోయాడు.

ఆ ఫోన్ నంబరు తనకు తెలిసినట్టే అనిపిస్తుంది. ఎపుడు.. ఎపుడూ? అని ఒక్క క్షణం కళ్ళు మూసుకుని నుదుటిపై చేత్తో రాసుకున్నాడు.

చటుక్కున మెరుపు మెరిసినట్టు గుర్తొచ్చింది అతడికి.

ఆరోజు చాందినీ చౌక్‌లో రెస్టారెంట్‌లో కూర్చుని ఉండగా ఒక కాల్ వచ్చింది. అది సరిగా కనెక్ట్ కావటం లేదు. ఫుడ్ ట్రేలు తెచ్చిన వెయిటర్, "ఇక్కడ అసలు సిగ్నల్ రాదు సర్, బయటకు వెళ్ళి మాట్లాడండి" అని చెప్పాడు. అపుడు తను మమ్మీని, డాడీని 'మీరు తింటూ ఉండండి. కాల్ మాట్లాడేసి వస్తాను" అంటూ బయటకు వెళ్ళాడు.

బాధగా కళ్ళు మూసుకున్నాడు అతడు.

అవును, అదే నంబర్ ఇది. వెంటనే ఆ నంబర్‌కి డయల్ చేసాడు. వెంటనే లిఫ్ట్ చేసారు. కాని తను 'హలో' అనేవరకు అవతలి వ్యక్తి హలో అనకపోవటం గమనించాడు హేమంత్.

"హలో, రాజేశ్వరిగారితో మాట్లాడాలి" అన్నాడు.

"మీరెవరు?" అడిగింది ఆమె.

"నా పేరు హేమంత్. లత డైరీలో మీ నంబరు చూసి చేశాను."

"ప్లీజ్ మీరు పెట్టేయండి. నేను మళ్ళీ చేస్తాను మీకు" అని కట్ చేసింది ఆమె.

ఆ నెంబర్ నుండి అరగంట తర్వాత కాల్ వచ్చింది. లిఫ్ట్ చేసాడు.

"హేమంత్‌గారూ, నమస్తే అండి. మీరు నాకు తెలియక పోయినా లత ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో మీ పేరే వినిపించేది. పాపం మీ కోసం అంతగా తపించేది లత. మీరు నా నంబర్‌కు ఫోన్ చేశారంటే, లత మీ దగ్గరకు చేరిందని అర్థమైంది. తను ఎలా ఉందండీ?"

"ఫర్వాలేదు, బాగానే ఉంది."

"నేను ఒకసారి లతతో మాట్లాడవచ్చాండీ?"

"తప్పకుండా. కానీ నేను ఊరుకు వచ్చాను పనిమీద. తిరిగి వెళ్ళాక మీరు కాల్ చెయ్యండి, నా నంబర్ ఇదే."

"అలాగే సార్" అంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS